

# జానపద నృత్య కళ



మానవజీవితంలో అవినాభావమైనవి సంగీత సాహిత్యాలు. ఈరెండూ కలిసి పుట్టేవి నృత్యాలు. విశ్వమంతటా మానవ సమూహాలు, ఆ మానవసమూహాల్లో విలక్షణ మైన నృత్యరీతులు కనిపిస్తాయి. మనిషి కంటె 'నృత్యకళ' ఎంతో ప్రాచీనమైంది. విశ్వాంతరాళం లోని గోళాలనడుమ ఒక నిర్దిష్టక్రమ విన్యాసంతో కూడిన గతిచలనం వుంది. అలా ఏర్పడిందే మనిషిలోని సహజమూ అనభ్యస్తమూ అయిన 'నృత్యశీలం'. విశ్వాంతరాళంలో జరిగే ఈ ఖగోళ చలనమే మన కంటికి రేయింబవళ్ళను సృష్టిస్తోంది. కాలంతో ముడిపడినవే పుట్టుక మొదలు గిట్టేదాకా మానవుడి కార్యకలాపాలు. దీన్ని గుర్తిస్తే మానవుడి జీవితంలోని గతి భిన్న చారిత్రక దశల్లో సామాజిక రంగాల్లో పొందుతూ వచ్చిన ప్రతీకాత్మక ప్రతిఫలమే నృత్యంగా అర్థంచేసుకోవచ్చు. నడిచేటప్పుడు రెండు కాళ్ళనూ ప్రపంచంలో ఏ మానవుడూ ఒకే సారి కదిలించడు. అలా కదిలిస్తే 'గెంతటం" అవుతుంది, కానీ నడకకాదు. [రెండు కాళ్ళనూ ఒకేసారి కదిలించే గుణం పిచ్చుకల్లో వుంది.] ఇక్కడే మానవుడిలోని గతి ప్రథమంగా బయటపడేది. చుట్టూ వున్న ప్రతిజీవిలోనూ వున్న కదలికే మనిషిలో క్రమబద్ధమైన నడకగా పరిణతిని పొందింది. బుద్ధిజీవిగా వికసించటంతో పాటు మనిషి తన నడకను అభినయంగా మార్చుకో గలిగాడు. ఆంతరికమైన గతికి అభివ్యక్తీకరణగా వున్న నడక మానవుడిలోని ఆలోచనల్ని ప్రకటించే అభినయమైంది. గిరిజన ఆదిమజాతుల్లో కనిపించే నృత్యం విశ్వాంతరాళంలోని ఖగోళగతిలాంటిది. మానవుడు నడుస్తున్నపుడు కుడికాలును కుడిచేతిని వేర్వేరుగా ఒక్కోసారి ముందుకీ వెనక్కీ ఆడించేటంత సహజమైంది ఈగతి. జానపదుల్లో నాగరికుల్లో కూడా ఈ చేష్టాత్మక అభివ్యక్తివున్నా క్రమంగా మానవుడిలో ఎదిగిన సామాజిక చారిత్రక తాత్త్విక రంగాలను ఆవిష్కరించే ప్రయత్నంకూడా కన్పిస్తుంది. ఇక్కడే నడక అభినయంగా మారుతోంది. అందుకే ఆదిమ నృత్యాలంత సహజంగా కాకుండా, జానపద నృత్యాల్లో అన్నీ కాక పోయినా, కొన్నైనా నేర్చుకోబడుతున్నాయి. కానీ ఈ నేర్చుకోవటం శిష్ట నృత్య సంప్రదాయాల్లోని శాస్త్రజ్ఞాన సంపాదన లాంటిది కాదు. "నృత్యకళ"నే గురువుద్వారా నేర్చుకోవటం లాంటిది. దీన్నే "జానపదనృత్యశీలత" అంటారు.

## నృత్యమూలాలు

గిరిజన నృత్యాలు జానపదనృత్యాలకు, జానపద నృత్యాలు శాస్త్రీయనృత్యాలకు ఆధారాలుగా కన్పిస్తున్నాయి. కవి పదాల్ని మాత్రం రాస్తాడు. నాట్యకత్తె దాన్ని అనేక సార్లు పలుకుతూ హావభావ విన్యాసాల ద్వారా చూపిస్తుంది, ఇంకా ముద్రలద్వారా ముఖ కవళికల ద్వారా ప్రకృతిమాతను అందరి ఎదుట పెట్టటం శాస్త్రీయనృత్యాల్లో మనం చూస్తాం. ఇలాంటివి జానపద గిరిజన నృత్యాల్లో ఉండవు.

జానపదనృత్యాల్లో సహజత్వం, సరళత వుంటుంది. దీనివెనుక భావగాంభీర్యం, పరిపూర్ణ అభివ్యక్తి పూర్వక సంభాషణ సంపాదనం తక్కువ. కారణం ఇవి స్వయం ప్రేరితాలు. నృత్యం చేస్తున్నపుడు నృత్యగాండ్రు, ప్రేక్షకులు అనే భేదం వుండదు. ఈ నృత్యాలు ఆ యా జాతుల జీవితాల్లో ముడివడి ఉన్నాయి. కానీ సాంప్రదాయికంగా, కులవృత్తిగా కన్పిస్తున్నాయి.

ఏ నృత్యానికైనా అక్షరాభ్యాసం "తెయ్యం తత్త" అని భరత కళాప్రపూర్ణ నటరాజ రామకృష్ణగారు తెలిపారు. ఇంకా వీరు 'ఏ నృత్యమైనా లంబం, సమలంబం, విషమలంబం, ఆవర్తం మీద ఆధార పడిందే. అసలు అవి ఐదు విన్యాసాలు. అవే సమయానుకూలంగా మారుతా'యని తెలిపారు.

---

కళావని

---

ఈ నృత్యకళలో నృత్త, నృత్య, నాట్యం, తాండవ, లాస్య అనే రకాలున్నాయి.

ఇలాంటి నృత్యకళ రాయలసీమలో ఎంతో దాగివుంది. ఈ జానపదనృత్యకళలు పొట్టకూటికోసం కూడా నోచుకోలేని పరిస్థితిలో వున్నాయి. అలాంటి వాటిలో కొన్నింటినిమాత్రమే ఇక్కడ పరిశీలించటం జరిగింది.

## నృత్యాల రకాలు

1. ఆసాదివాండ్లనృత్యం 2. ఉరుముల నృత్యం 3. కోలాటం 4. పండరిభజన 5. చెక్కభజన 6. మదిలి 7. నామాలసింగడు 8. లంకిణీ నృత్యం 9. తప్పెటనృత్యం మొదలగునవి.

పైవాటిలో మదిలి, నామాలసింగడు, లంకిణీనృత్యాలు, తప్పెట సహాయంతో మాత్రమే చేసే నృత్యాలు. సాహిత్యం అంతగా వుండదు. నృత్తంతో కూడి వుంటాయి. అంటే కేవలం అడుగులు, కేకలు మాత్రమే ఉంటాయి. తప్పెటతో వివిధ గతుల ఆధారంగా ఈ నృత్యాలు సాగుతాయి. మిగిలిన నృత్యాల్లోని సాహిత్యం ఎంతో వివరించదగ్గది.

## ఆసాదివాండ్ల నృత్యం

ఈ నృత్యం సాంప్రదాయికంగా కులవృత్తి పరంగా సాగేది. ఇప్పటికీ రాయలసీమ ప్రాంతంలో ఈ వంశంవారు ఉన్నారు. ప్రతి ఉగాది పండుగనాడు ఇప్పటికీ ఈనృత్యాన్ని చేస్తున్నారు. వీరు నృత్యంచేస్తూ చెప్పే కథలున్నాయి. అవి ఏడుకోర్ల పెద్దమ్మస్వామికథ, వీరతమ్మమ్మ కథ, చల్లాపురమ్మకథ, ఆంకాళమ్మకథ మొదలగునవి. వీరు వాడే వాద్యం 'జవికిని' కంచుతో చేయబడి వుంటుంది. ముగ్గురుంటారు. ప్రధానగాయకుడు మల్లు